అభివృద్ధిని అప్రతిష్టపాలు చేసేలా సమీక్ష

- మాకు కనీసం సమాచారం ఇవ్వరా..?
- ఆహ్వానం లేకపోవడం నగర ప్రజలను అగౌరవపర్చడమే
- కలెక్టర్‌కు నగర మేయర్ బహిరంగ లేఖ

కార్పొరేషన్, జూన్ 19: 'కరీంనగర్‌లో నియమ నిబంధనల ప్రకారం జరిగిన అభివృద్ధిని అప్రతిష్టపాలు చేసేలా మున్సిపల్ సమీక్ష సమావేశం జరిగింది. నగర ప్రజల ప్రతినిధిగా, మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మాకు మున్సిపల్‌పై సమీక్ష గురించి కనీస సమాచారం లేకపోవడం, ఆహ్వానించకపోవడం నగర ప్రజలను అగౌరవ పరిచినట్లే'నంటూ నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బుధవారం కలెక్టర్‌కు బహిరంగ లేఖ రాశారు. లేఖ పూర్తి సారాంశం.. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు మనవి చేయునది ఏమనగా.. ఈ నెల 18న కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీ ఆధ్వర్యంలో లోకల్ బాడీ అదనపు కలెక్టర్, నగర కమిషనర్, అధికారులతో నగరాభివృద్ధి విషయమై సమీక్ష నిర్వహించినట్లు దినపత్రికల ద్వారా మా దృష్టికి వచ్చింది. కానీ నగర ప్రజల ద్వారా ఎన్నికై నగరపాలక సంస్థ మేయర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మాకు ఎలాంటి సమాచారం, ఆహ్వానం లేకపోవడం, ఇంకా కరీంనగర్ జిల్లాకు, నగరపాలక సంస్థకు సంబంధం లేని వారితో సమీక్ష జరుగడం ఎంత వరకు సమంజసమో మీరే నిర్ణయించాలి. ఈ సమావేశం నగరపాలక సంస్థ పాలకవర్గం మనోభావాలు దెబ్బ తీసేలా జరిగిందని మేం భావిస్తున్నాం. గత నాలుగున్నరేండ్లు మా పాలనలో కరీంనగర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, నగరపాలక సంస్థ సాధారణ నిధులతో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. ఈ అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆనాటి నుంచి ఈ నాటి వరకు అప్పటి మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, కమిషనర్లు, అధికారులు, పాలక వర్గ సభ్యుల మద్దతు, సహకారం ఎంతో గొప్పది. అందుకే ఇంత ప్రగతి సాధ్యమైంది. ఇంతటి గొప్ప కార్యక్రమాలు చేయడంలో సహకరించిన అధికారుల మీద ఆరోపణలు చేసి అప్రతిష్టపాలు చేయడానికే ఈ సమావేశం నిర్వహించినట్లుగా మేం భావిస్తున్నాం. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు, సీఎం అస్యూరెన్స్‌కు సంబంధించి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో ఉన్నతాధికారుల నుంచి మొదలుకొని జిల్లా కలెక్టర్ల అందరి అనుమతులు, మంజూరు తీసుకొని చట్టబద్ధంగా టెండర్లు పూర్తి చేసి చేపట్టాం. ఎక్కడ కూడా నియమ నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టలేదు. మీ సమక్షంలో నిర్వహించిన సమీక్షా సమావేశం ముఖ్య ఉద్దేశం నగరపాలక సంస్థలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు జరిగినటువంటి సౌకర్యాలను చులకన చేసి, ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నట్లు మేం భావిస్తున్నాం. కలెక్టరేట్ సమావేశ మందిరం తమరి ఆధ్వర్యంలో జరిగిన నగరపాలక సంస్థ సమీక్షా సమావేశానికి మమ్మల్ని ఆహ్వానించకపోవడం ప్రొటోకాల్ ఉల్లంఘనతో పాటు మాకు బాధ్యతలు ఇచ్చిన నగరప్రజలను అగౌరవపరిచినట్లుగా భావిస్తున్నాం.

ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు

మానకొండూర్ రూరల్, జూన్ 19: గట్టు దుద్దెనపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపగా, హెల్పింగ్ హ్యాండ్స్ సిబ్బంది సన్మానించి ప్రోత్సాహకాలు అందజేశారు. పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన కనకం అదితికి రూ. 2500, రెండో స్థానంలో నిలిచిన బాకారపు ఆశ్రితకు రూ. 2016 చొప్పున అందజేసి అభినందించారు. పాఠశాల హెచ్ఎం ఇంద్రసేనా రెడ్డి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ చంద్రకళ, ఉపాధ్యాయులు ఉన్నారు.

జాతర్లకు హాజరైన ఎమ్మెల్యే

శంకరపట్నం/ మానకొండూర్ రూరల్, జూన్ 19: శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో బుధవారం జరిగిన పెద్దమ్మ తల్లి జాతరకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు చెల్లించారు. అలాగే మానకొండూర్ మండలం అన్నారం గ్రామంలో రేణుకా ఎల్లమ్మ జాతర మహోత్సవానికి హాజరై, ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవార్ల దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట శంకరపట్నం మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముదిరాజ్, గౌడ సంఘాల నాయకులు, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
EDUCATION
★రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed., B.Ed., B.P.Ed., MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339.
NT-333727

CHANGE OF NAME
I, ERRABELLI SAMPATH RAO (New Name) Previously called A. SAMPATH RAO (Old Name) and R/o H.No. 1-107, Gandrapalli (Vill), Jammikunta (Mdl), Karimnagar Dist. - 505 475, T.S., India Solemnly declare.

సంపాదించుకోవచ్చు
★మీ ఇంటి వద్ద ఉండి రోజుకు 2 గం॥ చేతివ్రాత ద్వారా నెలకు 10 వే॥ల నుండి 15 వే॥ల వరకు సంపాదించుకోవచ్చు. పూర్తి వివరములకు కాల్ చేయండి. సెల్: 6304484084.
NTK-311301

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

అన్ని వసతులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు

- వేగంగా నిర్మాణ పనులు పూర్తి చేస్తాం
- ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం
- నగర మేయర్ సునీల్‌రావు

కశ్మీర్‌గడ్డ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను ప్రారంభించి పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, జూన్ 19: నగర ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలు అందించేందుకు నగరపాలక సంస్థ ద్వారా అన్ని వసతులతో నాలుగు ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు ఏర్పాటు చేస్తున్నామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. వాటి నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. బుధవారం నగరంలోని కశ్మీర్‌గడ్డ రైతుబజార్ ప్రాంతంలో రూ. 10 కోట్ల వ్యయంతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కశ్మీర్‌గడ్డ మార్కెట్‌కు ఎంతో పేరు ఉందని, ఇక్కడ అత్యాధునిక హంగులు, అన్ని రకాల సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేస్తున్నామన్నారు. నగర ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణంలో ఆహార పదార్థాలు అందించాలన్న సంకల్పంతో మార్కెట్ నిర్మాణం చేస్తున్నామన్నారు. విక్రయదారులు, కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆరు నెలల్లోనే ఈ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సెమీ సెల్లార్ పార్కింగ్‌తో పాటు వెజ్, నాన్‌వెజ్ విక్రయాల కోసం వేర్వేరుగా రెండు బ్లాకులతో ప్లాట్ ఫాంలు ఏర్పాటు చేస్తూ రెండు అంతస్తుల్లో మార్కెట్ నిర్మిస్తున్నామని తెలిపారు. మార్కెట్‌కు వచ్చి వెళ్లే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా దీని నిర్మాణం ఉంటుందన్నారు. పార్కింగ్ సౌకర్యం, మరుగుదొడ్లు, తదితర అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని శుభ్రతతో ఉండేలా హైజెనిక్ కండిషన్‌లో ఆహార పదార్థాలు లభ్యమయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అధీనా, తుల శ్రీదేవీ చంద్రమౌళి, గుగ్గిళ్ల జయశ్రీ, గందె మాధవి, తోట రాములు, వాల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

టు డే లీగ్స్ జట్టు ఎంపికలకు స్పందన

కొత్తపల్లి, జూన్ 19 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఈ నెల చివరివారంలో నిర్వహించే టు డే లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు సుమారు 136 మంది క్రీడాకారులు హాజరు కాగా, వారికి బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన 26 మందిని ఎంపిక చేసినట్లు అధ్యక్ష కార్యదర్శులు వీ ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు కే మహేందర్‌గౌడ్, వీ మనోహర్‌రావు పేర్కొన్నారు.

చేగుర్తి గొర్రెల పెంపకదారుల సంఘం కార్యవర్గం

కరీంనగర్‌రూరల్, జూన్ 19: చేగుర్తి గ్రామంలోని ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో వారి ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి అనిల్ కుమార్ బుధవారం ప్రకటించారు. సంఘం అధ్యక్షుడిగా బాషవేని మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా మారం రంగయ్య, కార్యదర్శిగా అట్ల అనిల్ ఎన్నికైనట్లు వెల్లడించారు.

బండి సంజయ్‌కు అపూర్వ స్వాగతం

ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంత్రి బండి సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

విద్యానగర్/కొత్తపల్లి/ గంగాధర, జూన్ 19: కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం బండి సంజయ్ కుమార్ బుధవారం తొలిసారి కరీంనగర్‌కు రాగా, అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని శనిగరం నుంచి మొదలు జిల్లా కేంద్రానికి చేరే దాకా పలు చోట్ల పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. శనిగరంలో బండి సంజయ్ ఎదుట బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ కర్రసాము చేస్తూ విన్యాసాలతో స్వాగతం పలికి అందరినీ ఆశ్చర్య పరిచారు. అనంతరం కరీంనగర్‌కు చేరుకున్న బండి సంజయ్‌కు ఎన్టీఆర్ విగ్రహం చౌరస్తా వద్ద, గీతాభవన్ చౌరస్తా వద్ద కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద కేంద్ర సహాయమంత్రికి కలెక్టర్, అదనపు కలెక్టర్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణరావు ఆధ్వర్యంలో సంజయ్‌ను గజమాల, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు కిరణ్ కుమార్‌రెడ్డి, నాగుల నరసింహస్వామి, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మిందర్‌సింగ్, మారుపాక రాజేశ్ భరద్వాజ్ తదితరులున్నారు. గంగాధర మండలానికి వచ్చిన బండి సంజయ్ కుమార్‌ను మధురానగర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు గజమాల, శాలువాలతో సన్మానించారు.

బండి సంజయ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న టీఎన్జీవో నాయకులు

ఉపాధ్యాయులకు ప్రమోషన్లు

కమాన్‌చౌరస్తా, జూన్ 19 : రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధ్యాయుల ప్రమోషన్లలో భాగంగా, జిల్లాలో ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులు బుధవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో బాధ్యతలు చేపట్టారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రమోషన్ల ప్రక్రియ పూర్తికావడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులు వారు పని చేస్తున్న పాఠశాల నుంచి కొత్తగా ప్రమోషన్ పొందిన పాఠశాలల్లో చేరగా, ఏర్పడిన ఖాళీల భర్తీకి త్వరలో బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది.

కోట్లనర్సింహులపల్లివాసికి విశిష్ట సేవా పురస్కారం

గంగాధర, జూన్ 19 : మండలంలోని కోట్లనర్సింహులపల్లి గ్రామానికి చెందిన గంగాధర సంపత్ సేవా రంగంలో చేసిన విశిష్ట సేవలకు గానూ విశిష్ట సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో శుభప్రదం సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సేవాసమితి ఫౌండర్ నీలిమ, ప్రధాన కార్యదర్శి అభిరామ్ సంపత్‌కు అవార్డును అందజేశారు. పురస్కారం అందజేసిన నిర్వాహకులకు సంపత్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ అంతరాయం కలుగకుండా చూడాలి

సైదాపూర్, జూన్ 19: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో విద్యుత్ అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో హుజూరాబాద్ డీఈ లక్ష్మారెడ్డి కోరారు. మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాలకు లైన్‌లు తెగినా, సరఫరా నిలిచిపోయినా సిబ్బంది సకాలంలో సమస్య పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్, ఏఈ బొమ్మ ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

కేకులు కోసి.. స్వీట్లు పంచి

వీణవంక/మానకొండూర్/ తెలంగాణచౌక్/ శంకరపట్నం/ చొప్పదండి/ సైదాపూర్/ గంగాధర, జూన్ 19: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకొన్నారు. వీణవంక మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. జమ్మికుంట స్పందన బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్, నాయకులు పాల్గొన్నారు. నగరంలోని తొమ్మిదో డివిజన్ కోతిరాంపూర్‌ని గిద్ద పెరుమాళ్ల దేవాలయంలో మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్యప్రసన్న రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మానకొండూర్, శంకరపట్నం, చొప్పదండి, సైదాపూర్ మండల కేంద్రాలతోపాటు గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, పండ్లు పంచారు.

వీణవంక మండల కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే సత్యనారాయణ

బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 అభ్యర్థులకు గ్రాండ్ టెస్ట్‌లు

కమాన్‌చౌరస్తా, జూన్ 19 : తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే గ్రూప్ -2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ -2 గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి అభ్యర్థులు జూలై 5వ తేదీలోగా www.tgbcstudycircle.cgg.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో జూలై 8, 9, 15, 16, 22, 23, 30, 31వ తేదీల్లో ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు అలాగే, మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

చొప్పదండి, జూన్ 19: చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏ శరత్ బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సుల్లో తెలుగు/ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థినీ విద్యార్థులు కళాశాలలో చేరి ప్రభుత్వ సదుపాయాలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం కళాశాలలో ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.

గిరిజన డిగ్రీ కళాశాలలో..

కొత్తపల్లి, జూన్ 19: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బీ లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ (ఫిజికల్ సైన్స్), బీఎస్సీ (లైఫ్ సైన్స్), బీకాం (సీఏ), బీఏ గ్రూపుల్లో చేరేందుకు 2023-24 సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఐదు ఫొటోలు, ఆధార్‌కార్డు, రెండు సెట్ల జిరాక్స్‌లను వెంట తీసుకొనిరావాలని తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 7901097692లో సంప్రదించాలని సూచించారు.

సివిల్స్ ఉచిత కోచింగ్‌కు..

కమాన్‌చౌరస్తా, జూన్ 19 : ఎస్సీ స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచిత శిక్షణ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎండీ హమీద్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం అర్హులైన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు జూలై 10వ తేదీలోగా tsstudycircle.co.in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కమాన్‌చౌరస్తా, జూన్ 19 : జిల్లా కేంద్రంలోని మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయ 14వ బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎన్ శ్రీనివాస్, వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, శనివారం ఉదయం 9 గంటల నుంచి శ్రీ భూనీళాసమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం, సాయంత్రం 6 గంటల నుంచి రథోత్సవం జరుగనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సుదర్శన, నారసింహ హోమం, పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు ద్వాదశారాధన, సప్తావరణాలు, ఏకాంత సేవ జరుగుతాయని తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

సైదాపూర్, జూన్ 19: మండలంలోని సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించాలని ఎంపీపీ సారబుద్ల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పలువురు ఎంపీటీసీలు వివిధ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం సభలో పలు తీర్మానాలు చేశారు. ఆకునూర్, గొడిశాలలో పశువైద్య సబ్‌సెంటర్‌లు ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, మండలానికి మంజూరైన మహాత్మాజ్యోతిబా పూలే గురుకులాన్ని ప్రస్తుతం హుజూరాబాద్‌లో నిర్వహిస్తున్నారని, దాని కోసం మండలంలో భవనం నిర్మించాలని సభలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఏవో వైదేహి, ఎంఈవో కేతిరి నర్సింహారెడ్డి, ఏపీఎం కుమార స్వామి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రేపు పది జిల్లాల కళాకారుల సంగీత విభావరి

కమాన్‌చౌరస్తా, జూన్ 19 : ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఫిలింభవన్‌లో శుక్రవారం ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 10 జిల్లాల కళాకారుల సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సల్వాజి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయని, సంగీత విద్వాంసులు, గురువులకు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కళాకారులు, కళాభిమానులు, కళా పోషకులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

20న ధర్నాను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, జూన్ 19: నీట్ పరీక్ష పత్రం లీకేజీపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న నగరంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలోని బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 20 చేపట్టిన ధర్నాలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి గుడికుందుల సత్యం, నాయకులు ఎడ్ల రమేశ్, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్

- సరిపడా బస్సులు లేక ఇబ్బందులు

తెలంగాణచౌక్, జూన్ 19: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రయాణికులతో బుధవారం కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులతో పాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో రద్దీ పెరుగగా, సరిపడా బస్సులను అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ రీజియన్‌లో మహాలక్ష్మి పథకానికి ముందు 1.50లక్షల మంది ప్రయాణికులు నిత్యం వివిధ ప్రాంతాలకు ప్రయాణించేవారు. మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించిన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. కానీ, రీజియన్‌లో ఉన్న 929 బస్సు సర్వీసులతోనే ఆర్టీసీ సేవలను కొనసాగిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్య పెంచి మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే

సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, జూన్ 19: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నిరుద్యోగ సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ ఏర్పాటులో నిరుద్యోగుల పాత్రను గుర్తుచేసి, నోటిఫికేషన్ వరకు గ్రూప్2, 3 పోస్టులను పెంచాలని, డీఎస్సీ పరీక్షలకు మ